

కొందుర్గు ఎంకిర్యాల వాగును పరిశీలిస్తున్న అధికారులు,నాయకులు

ఎంకిర్యాల, తంగెళ్లపల్లి బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం

చౌదరిగూడ,మే 19(ఆంధ్రజ్యోతి): ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఎంకిర్యాల, తంగేళ్లపల్లి వాగు బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం కలగనుంది. సోమవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్‌బీ ఈఈ రవీందర్ మాట్లాడుతూ స్థానిక ప్రజల సమస్యలు చూసి కాంట్రాక్టర్‌కు పూర్తిస్థాయిలో బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే సామగ్రిని ఎమ్మెల్యే అందించడం సంతోషకరమన్నారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు. స్థానిక నాయకులు జితేందర్ రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, మాసయ్యగౌడ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




ప్రతీ ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి

పులిమామిడిలో బొడ్రాయికి పూజలు

6



సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా విద్యాశాఖ ముందుకు సాగుతోంది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పోటీని తట్టుకుని పిల్లల సంఖ్య పెంచేందుకు కసరత్తు చేస్తుంది. ఇందుకోసం ఉపాధ్యాయులు 'బడిబాట' పట్టనున్నారు. వచ్చే నెల 6 నుంచి ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులను కలవనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, బోధన గురించి వివరించేందుకు సిద్ధమవుతున్నారు. పద్నాలుగు రోజుల పాటు రోజుకో కార్యక్రమం చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం

కార్యక్రమ షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ

సమష్టిగా ముందుకెళ్లాలంటున్న అధికారులు



రారండోయ్

సర్కారు బడికి!

వచ్చే నెల 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట



పాఠశాలలు	విద్యార్థులు
1,341	1,38,969

రంగారెడ్డి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంపుదలే లక్ష్యంగా విద్యాశాఖ బడిబాటను నిర్వహిస్తోంది. జూన్ 6 నుంచి 19వ తేది వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తుంది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ బడిబాట ద్వారా చేపట్టే కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేసింది. జిల్లాలో ఉపాధ్యాయులు బడిబయట ఉన్న, బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు ముందస్తుగా బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జూన్ 6వ తేదీ నుంచి ఉపాధ్యాయులు తప్పనిసరిగా వారు పనిచేస్తున్న ప్రాంత పరిధిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

కార్యక్రమాల వివరాలు

6వ తేదీన స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ పెద్ద ఎత్తున గ్రామసభ నిర్వహించాల్సి ఉంటుంది. 7న ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను

మిగతా 8వ పేజీలో...



ఆదిభట్లలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

భారీగా ఏసీపీల బదిలీలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో భారీ స్థాయిలో ఏసీపీలు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 77 మంది ఏసీపీలను బదిలీ చేసిన ప్రభుత్వం రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల నుంచి అనేక మందికి స్థానచలనం కల్పించింది. రాచకొండ కమిషనరేట్‌లో ఎస్‌ఓటీలో పనిచేస్తున్న వి. శ్రీకాంత్‌గౌడ్‌ను శంషాబాద్ ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే సిద్దిపేటలో పనిచేస్తున్న సీహెచ్ శంకర్‌రెడ్డిని మేడ్చల్ ఏసీపీగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న బాలగంగిరెడ్డిని పేట్ బషీరాబాద్ ఏసీపీగా నియమించారు. హెచ్ఎండీఏలో డీఎస్పీగా పనిచేస్తున్న జానకీరెడ్డిని మహేశ్వరం ఏసీపీగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న కాంతారెడ్డిని ఏసీబీకి బదిలీ చేశారు. సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎస్ లక్ష్మీనారాయణను షాద్‌నగర్ ఏసీపీగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న రంగస్వామిని డీజీ ఆఫీస్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. వెయిటింగ్‌లో ఉన్న ఎన్ శ్రీనివాస్‌ను పరిగి డీఎస్పీగా నియమించారు. అయితే శ్రీనివాస్ నాలుగు నెలల నుంచి ఇక్కడ ఇన్‌చార్జ్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పరిశీలించండి.. పరిష్కరించండి!

- అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు
- ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డి
- ప్రజల నుంచి 53 ఫిర్యాదుల స్వీకరణ



సమస్యలు వింటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 53 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. సాయంత్రం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 25లోపు ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజీవ్‌యువ వికాస పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్లను అరికట్టాలి

విద్యుత్ అక్రమ కనెక్షన్లను అరికట్టాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చార్మినార్ సమీపంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందటం బాధాకరమన్నారు. జిల్లాలో అక్రమ విద్యుత్ కనెక్షన్లపై నిఘా పెట్టాలని తెలిపారు. గ్రామాల్లో గుడిసెలు, కొట్టాల వద్ద విద్యుత్ కొగ్గీలు వేసి చౌర్యానికి పాల్పడే క్రమంలో షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదముందని, అలాంటి వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. స్కూళ్లు, ఆసుపత్రుల వద్ద ఫైర్ సేఫ్టీ పాటించకుంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అగ్ని మాపక, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.



నీటి కోసం నిరసన

తాగునీటి ఎద్దడి తీర్చాలని శంకర్‌పల్లి మున్సిపల్‌లోని సింగాపురం మహిళలు సోమవారం ఆందోళనకు దిగారు. 10వ వార్డుకు చెందిన మహిళలు వాటర్ ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సింగాపురంలో రెండు వార్డులు ఉన్నాయని, ఒక వార్డుకు మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. మా వార్డులో నీటి కోసం ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించకుంటే కలెక్టర్ దగ్గరికి వెళ్తామని హెచ్చరించారు.

శంకర్‌పల్లి, మే 19(ఆంధ్రజ్యోతి)

పంట మార్పిడితో అధిక దిగుబడులు



రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

కొత్తూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతీ సంవత్సరం పంట మార్పిడి చేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ ఏవీ రామాంజనేయులు సూచించారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో సోమవారం రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి రామాంజనేయులు హాజరై వ్యవసాయంలో సరైన సాగు పద్ధతి, పలు అంశాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి చేసుకుని, రసాయన ఎరువులను తగ్గించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. సేద్యంతో పాటు, సమగ్ర వ్యవసాయం చేయాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకుని, అధికారులు సూచించిన పంటను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ రంజిత, స్థానిక వ్యవసాయాధికారి గోపాల్, ఏఈవో దీపిక, పీహెచ్‌డీ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు ఉట్టి మాటే..!

జాడలేని భూసార పరీక్షలు

సాయిల్ టెస్టులపై అవగాహన కల్పించని అధికారులు

పోషకాల అవసరం తెలియక అన్నదాతల అవస్థలు - పడిపోతున్న దిగుబడులు



భూసార పరీక్షలు నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారి



ప్యాకెట్లలో మట్టి నమూనా

చేవెళ్ల/యాచారం, మే 19 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో నేల స్వభావం కీలక పాత్ర పోషిస్తుంది. మట్టిలో తగిన పోషకాలుంటేనే అధిక దిగుబడులు సాధించవచ్చు. ఇందుకోసం భూసార పరీక్షలు చేయించి వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. నేల సారవంతం తగ్గట్టుగా ఎరువులు వాడితే మంచి దిగుబడులు పొందవచ్చు. కానీ ఐదేళ్లుగా భూసార పరీక్షలు జరగడం లేదు. వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే వ్యవసాయాధికారులు ఇప్పటివరకు మట్టి నమూనాల సేకరణ చేపట్టకపోవడంతో రైతులు అవగాహన లేమితో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో దాదాపుగా లక్షకుపై ఎకరాల్లో సాగు భూమి ఉంది. ఇందులో ఎక్కువ శాతం మెట్ట ప్రాంతంలో నల్లరేగడి నేలలు ఉన్నాయి. వానాకాలంలో

మిగతా 8వ పేజీలో...

అవగాహన లేక నష్టపోతున్నాం



భూసార పరీక్షలపై చాలామంది రైతులకు అవగాహన లేదు. మట్టిలో పోషకాల గురించి తెలియక అధిక మోతాదులో ఎరువులు వాడి నష్టపోతున్నాం. వ్యవసాయ శాఖ అధికారులు ఈ సీజన్‌లో గ్రామాలలో సభలు పెట్టి రైతులను చైతన్యం చేయాలి.

- శివరాంరెడ్డి, రైతు, గడ్డమల్లాయగూడ

భూసార పరీక్షలు చేయిస్తాం



భూ సార పరీక్షలు చేయించేందుకు ఆసక్తి ఉన్న రైతు ఏఈవోకు తెలియజేస్తే మట్టి నమూనాలు సేకరిస్తాం. సేకరించిన మట్టి నమూనాలను రాజేంద్రనగర్ వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రంలో సాయిల్ టెస్టింట్ చేసి రెండు రోజుల్లో ఫలితాలను రైతులకు వివరిస్తాం. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, మందులు వాడాలి. అధిక మోతాదులో రసాయనాలు వాడితే పంట దిగుబడి తగ్గిపోతుంది.

- శంకర్‌లాల్, ఏవో చేవెళ్ల

పురాతన కట్టడాలను కాపాడాలి

పురావస్తు శాఖ పరిశోధకుడు శివనాగిరెడ్డి

ఆమనగల్లు, మే19 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండల కేంద్రంలో ఇనుప యుగం ఆనవాళ్లు నిర్లక్ష్యానికి గురికావడంపై పురావస్తు శాఖ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రేమ్‌నగర్ కాలనీలో జాతీయ రహదారి పక్కన ఉన్న 3వేల ఏళ్ల నాటి సమాధులను సోమవారం ఆయన సందర్శించారు. ఒకప్పుడు 100కు పైగా సమాధులు ఉన్నాయని, ఇప్పుడు నాలుగు మాత్రమే మిగిలాయని తెలిపారు. వాటిలో మూడు ఆనవాళ్లు కోల్పోగా బండరాళ్లు గుండ్రంగా అమర్చిన ఒక సమాధిపైన స్థానికులు గంగమ్మకు ఓ చిన్న ఆలయాన్ని నిర్మించారని, పురావస్తు ప్రాధాన్యత గల ఈ ఇనుప యుగపు కట్టడాలను కాపాడి భావితరాలకు అందించాలని ప్రేమ్‌నగర్ కాలనీవాసులకు, స్థానిక యంత్రాంగానికి శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీమ్‌రెడ్డి వెంకట్ రెడ్డి, శిల్పులు బడె సాయికిరణ్ రెడ్డి, తెలుగు ఎల్లయ్య పాల్గొన్నారు.



ఇనుప యుగం నాటి ఆనవాళ్లు



మంచాలలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

సుందరయ్య ఆశయసాధనకు కృషి

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

మంచాల, మే 19(ఆంధ్రజ్యోతి): భారత మార్క్సిస్టు నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయసాధనకు కృషి చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య పేర్కొన్నారు. మంచాలలో సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.యాదయ్య మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని చరిత్రగా చెప్పుకోవచ్చని కొనియాడారు. ఆయన స్వాతంత్ర్య పోరాటంలోనూ పని చేశారని గుర్తుచేశారు. సీపీఎం వ్యవస్థాపక సభ్యుడిగా ఉంటూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకభూమిక పోషించారని చెప్పారు. అసెంబ్లీకి, పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లి నిరాడంబరతను చాటిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మండల కార్యదర్శి రావుల జంగయ్య, మార బుగ్గరాములు, పి.జగన్, లెనిన్, కె.జంగయ్య, ఎస్.వెంకటేష్, ఎం.జంగయ్య, అశోక్, బుర్సి సుధాకర్, జి.బాల్‌రాజ్, ఏ.ఆనంద్, ఎన్.బిక్షపతి, బి.కవిత తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం : నిరంతరం పేదల ఉన్నతి కోసం పాటుపడిన పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాదన కోసం ప్రతి వ్యక్తి కృషి చేయాలని యాచారం మండల సీపీఎం కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ పేర్కొన్నారు. సాయుధ రైతాంగ పోరాటాలు చేసి నిరుపేదలకు భూములు పంచి ఆదుకున్న ఘనత ఆయనదేనన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా యాచారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పార్టీ కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నర్సింహ మాట్లాడుతూ తన ఆస్తులను పంచి పేదలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. రజాకార్ల ఆగడాలను అరికట్టడంతో పాటు భూస్వాముల దౌర్జన్యాలను అడ్డుకున్న గొప్ప మానవతా వాదన్నారు. ఆయన అనేక పోరాటాలు చేసి 10లక్షల ఎకరాల భూములను పంచారన్నారు. నాలుగు వేల గ్రామాల్లో వెట్టిచాకిరి నిర్మూలించి గ్రామ స్వరాజ్య స్థాపనకు పాటుపడ్డారని గుర్తు చేశారు. థావ్‌నాయక్, ఎంజె వినోద్, లాజర్, బాల్‌రాజ్, అంజయ్య పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఆచారి

ఆమనగల్లు, మే19(ఆంధ్రజ్యోతి): హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయను సోమవారం ఎన్సీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో ఆయనను నాయకులతో ఆచారి కలిసి శాలువాలతో సత్కరించారు.


దత్తాత్రేయను సన్మానించిన ఆచారి

పథకాల అమల్లో తెలంగాణ అగ్రస్థానం

ఆమనగల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): పథకాల అమలు, శాంతి భద్రతల పరిరక్షణ, ఉద్యోగాల కల్పన, పేదరిక నిర్మూలనలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతీ పేదకుటుంబాలకు మేలు జరుగుతోందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆలయాల్లో కల్యాణ ఉత్సవాలు, పూజల్లో పాల్గొన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. సూదిని కొండల్‌రెడ్డి, బట్టు కిషన్‌రెడ్డి, బాలాజీసింగ్, బొజ్జ సాయిరెడ్డి, యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, దళపతిగౌడ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, జగన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ప్రతీ ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క దైవచింతన అలవర్చుకొని ముందుకు సాగాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. పులిమామిడిలో నిర్మించిన ఎల్లమ్మ ఆలయం, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాల్లో సోమవారం మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డితో కలిసి పాల్గొని పూజలు చేశారు. గ్రామంలో నాలుగు రోజులు భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించిన గ్రామస్థులను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సంధ్యాదామోదర్‌గౌడ్, దేవి పాండుగౌడ్, అనితాశ్రీనివాస్, అంజయ్యగౌడ్, అంజిరెడ్డి, రమేష్, పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, భూంరెడ్డి, కృష్ణారెడ్డి, కె.చెన్నారెడ్డి, రఘునందన్, నర్సింహ, తాళ్ల నరేందర్, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.


పులిమామిడిలో బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి


కల్యాణోత్సవంలో నాయకులు, భక్తులు


పూజల్లో ఉప్పల వెంకటేశ్

కనులపండువగా బీరప్పస్వామి కల్యాణోత్సవం

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఆర్కపల్లిలో బీరప్పస్వామి-కామరావతిదేవిల కల్యాణాన్ని సోమవారం కనులపండుగగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కురుమ కుల పెద్దలు స్వామివారల కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమంలో నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, జంగయ్యగౌడ్, అనిల్‌కుమార్, పవన్ కుమార్‌రెడ్డి, యాదిరెడ్డి, మాలతికృష్ణారెడ్డి, వెంకటయ్యగౌడ్, తిరుపతిరెడ్డి, శేఖర్, రామాంజనేయులు, జంగయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: తలకొండపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులు ఉత్సవాలను నిర్వహిస్తారు. ఆలయ కమిటీ, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్-మంజుల దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేశారు. మొదటిరోజు అభిషేకం, అగ్ని ప్రతిష్ఠ, స్వస్తివాచన పూజలు నిర్వహించారు. నేడు స్వామివారి పరిణయోత్సవానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, గోపాల్‌నాయక్, లలితజోత్తయ్య, జగతయ్య, అర్చకులు మురళీధర్‌శర్మ, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

● ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కోట్‌పల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో 30ఫీట్ల బీజేపీ జెండాను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టూరిజం అభివృద్ధికి కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ.10కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. గతంలో గ్రామాల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం నిధులే అధికంగా ఉన్నాయని గుర్తుచేశారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు నిర్మించినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కృషిచేసి సత్తా చాటాలన్నారు. భారత్‌పై పాకిస్తాన్ చేసిన దాడి నాలుగు రోజుల్లోనే తిప్పికొట్టి బదులిచ్చిన ఘనత బీజేపీదని గుర్తుచేశారు. అనంతరం బార్వాద్‌లో భూలక్ష్మమ్మ అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, మండల అధ్యక్షుడు శివకుమార్, సీనియర్ నాయకులు పతంగే పాండు, మాజీ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, నాయకులు నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.


జెండా ఎగరవేసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అక్రమ పట్టాలు రద్దు చేయాలి

- రెవెన్యూ సదస్సులో మంత్రికి ఫిర్యాదు

ధారూరు, మే19(ఆంధ్రజ్యోతి): ముత్తాతల కాలం నుంచి కాస్తులో ఉండి సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములను అక్రమంగా పట్టా చేసుకున్నారని, విచారణ జరిపి ఈ పట్టాలను రద్దు చేయాలని మండలంలోని నాగసమందర్ గ్రామ రైతులు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు అందజేశారు. ధరణిని ఆసరాగా చేసుకుని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొంతమంది బీఆర్ఎస్ నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అక్రమంగా ఈ భూములను రిజిస్ట్రేషన్ చేసుకుని పట్టాలు పొందారని వారు వివరించారు. విచారణ జరిపి తమకు భూయాజమాన్య హక్కులు కల్పించి న్యాయం చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

● ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం. మే 19(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమ రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. సోమవారం మాల్‌లో చెక్‌పోస్టును తనిఖీ చేశారు. పశువులను అక్రమంగా రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం నల్లవెల్లిలో ప్రజలను కలిసి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. అపరిచిత వ్యక్తులు కన్పిస్తే 100కు కాల్ చేయాలన్నారు. ద్విచక్రవాహనాదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. చైన్‌స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సూచించారు. ఆయన వెంట సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధు ఉన్నారు.

దేశ రక్షణకు యువత వెన్నంటి ఉండాలి

కులకచర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకు యువత వెన్నంటి ఉండాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యకారిని సదస్యులు అన్నదానం సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక వివేకానంద కళాశాల ఆవరణలో ఐదు రోజులుగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం వీధుల మీదుగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు రూట్‌మార్చ్ నిర్వహించారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిందని అందులో భాగంగా ప్రతీ గ్రామంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంటరాని తనం నిర్మూలన, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యవాహ సంగమేశ్వర్, శేరి రాంరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడిపై దాడి

మోమిన్‌పేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసారంలో శనివారం గ్రామ పంచాయతీ కార్మికుడు లక్ష్మీగారి నర్సింహులుపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు విచక్షణ రహితంగా దాడి చేశారు. పంచాయతీ కార్మికులు రోజు మాదిరిగా శనివారం పరిశుభ్రత పనులు నిర్వహిస్తున్నారు. మురుగు కాల్వల్లో దోమల నివారణ కోసం బ్లీచింగ్ పౌడర్ చల్లుతుండగా డప్పు దిలీప్‌కుమార్ గ్రామ పంచాయతీలోకి వచ్చి బ్లీచింగ్ పౌడర్ ఇవ్వాలని కోరాడు. దీంతో నర్సింహులు బ్లీచింగ్ పౌడర్ ఇప్పుడు లేదని తెలిపాడు. దీంతో దిలీప్‌కుమార్ దుర్భాషలాడుతూ నర్సింహులుపై దాడి చేశాడు. పంచాయతీ కార్యదర్శి రవి ఇద్దరిని సముదాయించి అక్కడి నుంచి పంపించాడు. ఈ క్రమంలో దిలీప్‌కుమార్ తమ్ముడు డప్పు సుకుమార్ అటుగా వచ్చి జరిగిన విషయాన్ని తెలుసుకుని ఆగ్రహంతో నర్సింహులు దగ్గరికి వెళ్లి మాట్లాడుదామని చెప్పి దాడిచేశాడు. గమనించిన దిలీప్‌కుమార్ కుమారుడుతో కలిసి ముగ్గురూ నర్సింహులుపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో స్పృహ కోల్పోయిన నర్సింహులును కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ముగ్గురిపై ఫిర్యాదు చేశారు. వైద్యులు ఎంఆర్ఐ స్కానింగ్ తీయాలని తెలపడంతో సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి


బహుమతులు అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునందిస్తూ వివిధ స్థాయిల్లో రాణించేలా చూడాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లచెరువులో శ్రీరెడ్డి నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు పెద్దారెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి నిర్వహించిన క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. 4టీంలు పాల్గొన్నాయి. కార్యక్రమానికి గోలి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సాయిటీంకు మొదటి బహుమతి రూ.10,016, రన్నర్స్ మల్లేశ్ టీంకు రూ.7,016, క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతి రూ.10వేలు అందజేశారు. విద్యార్థులు, యువత క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాడ్గుల మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, నాయకులు జంగయ్యగౌడ్, మాలతి కృష్ణారెడ్డి, యాదిరెడ్డి, అనిల్‌కుమార్, పవన్‌కుమార్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, తిరుపతిరెడ్డి, రామాంజనేయులు, జంగయ్య, శేఖర్ పాల్గొన్నారు.


శివాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ అరుణ

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

షాద్‌నగర్‌రూరల్, మే19(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీ డీకే.అరుణ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్లలో సోమవారం శివాలయ పునర్నిర్మాణం, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శివాలయాన్ని తిరిగి నిర్మించుకోవడం గొప్ప విషయమన్నారు. గ్రామానికి బొడ్రాయి మూలమని, దాని వైశిష్ట్యాన్ని కాపాడుకోవాలన్నారు. అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, మచ్చ సుధాకర్‌రావు, హరిభూషణ్, మురళి, చెట్ల వెంకటేశ్, లష్కర్‌నాయక్, మోహన్, రంగయ్యగౌడ్ ఉన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంపీ అరుణ

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్‌లో ఈనెల 22న నిర్వహించే వీరహనుమాన్ విజయ యాత్ర పోస్టర్‌ను సోమవారం ఎంపీ డీకే అరుణ ఆవిష్కరించారు. విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4గంటలకు స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి హనుమాన్ యాత్ర ప్రారంభమవుతుందని నిర్వహణ కమిటీ సభ్యుడు చెట్ల వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, దుశ్యంత్‌రెడ్డి, మచ్చ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి ఫొటోను బహూకరిస్తున్న అప్పం రాఘవ

సీఎంకు పెయింటింగ్ బహూకరణ

ఆమనగల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లుకు చెందిన చిత్రకారుడు అప్పం రాఘవ గోల్కొండ కోట పెయింటింగ్ చిత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి బహూకరించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్‌లతో కలిసి కొండారెడ్డిపల్లిలో రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో రాఘవ మర్యాదపూర్వకంగా కలిశారు. తాను చిత్రీకరించిన గోల్కొండ కోట ఫొటోను బహూకరించి సత్కరించారు. రాష్ట్రంలో చిత్రకారుల సమస్యలను సీఎంకు వివరించారు. అర్హులైన నిరుపేద చిత్రకారులకు ప్రభుత్వ పథకాల్లో, ఇందిరమ్మ ఇళ్లలో అవకాశం కల్పించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు రాఘవ తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు భాస్కర్‌రెడ్డి, అప్పం శ్రీను, ఆసిఫ్‌అలీ, రూపం వెంకట్‌రెడ్డి, ఆనంద్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

మండల సాధన పోరాటం ఉధృతం

తలకొండపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి వాసులు పోరాటాన్ని ఉధృతం చేశారు. మండలంలోని గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 204వ రోజుకు చేరాయి. మండల కేంద్రం ఏర్పాటు చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని జేఏసీ నాయకులు ప్రకటించారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు చొరవ తీసుకొని మండల కేంద్రం ఏర్పాటు చేయించాలని కోరారు. 11 పంచాయతీలను కలిపి మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు అశోక్‌గౌడ్, వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, శరత్‌చంద్ర, ఖలీం, పాషా, యాదయ్య, చంద్రయ్య, జంగయ్య, ఇసాక్ పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన నాయకులు

ఆమనగల్లు, మే19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రారంభిస్తున్న ఇందిర గిర సౌర జల వికాస పథకం ప్రారంభం సందర్భంగా నాగర్‌కర్నూల్ పరిధి మాచారంలో నిర్వహించిన సీఎ రేవంత్‌రెడ్డి సభకు ఆమనగల్లు పట్టణం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో చెంచు, గిరిజన నేతలు సభకు బయల్దేరారు. హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై జిల్లా నాయకుడు మండ్లీ రాములు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండలాల నాయకులు సీఎంను కొండారెడ్డిపల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సభకు తరలినవారిలో పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, బిచ్యానాయక్, మానయ్య, ఫరీద్, షాబుద్దీన్, రాఘవేందర్, హీరాసింగ్, వెంకటేశ్వర్లుగౌడ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

తలకొండపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దుర్గాప్రసాద్, బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహలు అన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ తిరుగులేని శక్తిగా తయారైందన్నారు. తలకొండపల్లిలో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు తిరుమణి రవరిగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శానమోని పాండు, బక్కి కుమార్, పద్మఅనిల్, పాండు, రాజు, శేఖర్‌రెడ్డి, గెల్వలయ్య, శ్రీకాంత్‌గౌడ్, మహేశ్, శ్రీశైలం, మల్లేశ్, శ్రీనివాసచారి, కృష్ణవేణి, విజయమ్మ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరివర్ధన్‌రెడ్డి

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

మేడ్చల్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పూడూరు రైతుసహకార సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర లభించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి వడ్లను సేకరిస్తుందన్నారు. రైతులకు బస్తాలు పంపిణీ చేయడంతో పాటు, ధాన్యం వెంటవెంటనే కొనుగోలు చేసి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, కౌడె మహేష్ పాల్గొన్నారు.



శివాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

ఆధ్యాత్మికతతో ప్రజల్లో ఐక్యత

షాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామాల్లో ఐక్యత వెల్లివిరుస్తుందని, స్నేహభావం పెంపొందుతుందని రాష్ట్ర హాకీ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం షాబాద్ శివాలయంలో అభిషేకం చేసి, పునర్నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి రూ.40లక్షల వరకు ఖర్చు అవుతుందని నిర్ణయించారు. శివాలయం పునర్నిర్మాణానికి కృషి చేస్తామని గ్రామస్తులు అన్నారు. దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనుపంతులు, తమ్మలి రవీందర్, కల్వకోల్ వెంకట్‌యాదవ్, రాజేందర్‌గౌడ్, లింగప్ప, శ్రీకరప్ప, దర్పల్లి రవీందర్‌గౌడ్, రాహుల్‌గుప్తా, దండు మదన్‌గుప్తా, విశ్వనాథంగుప్తా, కృష్ణగుప్తా, సత్యనారాయణ, మల్లికార్జున్, రజనీకాంత్, వెంకటయ్య, చంద్రయ్య, అశోక్, సత్యం, శివలింగంగౌడ్, కె.శ్రీను, రమేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. అని చేరదీస్తే అంతమొందించాడు

మహిళ హత్య కేసు మిస్టరీని ఛేదించిన మేడ్చల్ పోలీసులు.. వివరాలు వెల్లడించిన డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి ముస్లి బస్తీలో ఓమహిళ దారుణంగా హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్య కేసుకు సంబంధించిన మిస్టరీని పోలీసులు ఛేదించారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి సోమవారం మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వికారాబాద్‌కు చెందిన లక్ష్మి ఉపాధి కోసం గత కొద్ది రోజులుగా అత్వెల్లి గ్రామంలో స్థిరపడి ఓవైన్‌షాపులో స్వీపర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. గతంలో లక్ష్మి పటాన్‌చెరు మున్సిపల్‌లో పారిశుధ్యం పనిచేసే వేళ లావణ్య అనే మహిళతో పరిచయం ఏర్పడింది. అనంతరం లక్ష్మి, లావణ్య పని మానేశారు. లావణ్య తన కొడుకు రాకేష్‌తో కలిసి నగరంలోని సైదాబాద్‌లో నివాసముంటోంది. రాకేష్ వ్యసనాలకు అలవాటుపడి జులాయిగా తిరుగుతుండటంతో తన కొడుకుకు పని ఇప్పించాలని లావణ్య తన స్నేహితురాలు లక్ష్మిని కోరింది. ఆమే రాకేష్‌ను తీసుకొని అత్వెల్లిలోని తన ఇంటికి రమ్మని లక్ష్మి చెప్పింది. దీంతో 15వ తేదీన లావణ్య తన కొడుకుతో లక్ష్మి ఇంటికి వెళ్లింది. అక్కడ ముగ్గురూ కలిసి కల్లు సేవించారు. అనంతరం రాకేష్‌ను మరుసటిరోజు పనిలో పెట్టిస్తానని లక్ష్మి అనడంతో లావణ్య తన కొడుకును అక్కడే వదిలేసి నగరంలోని సైదాబాద్‌కు బయల్దేరింది.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

అనంతరం రాకేష్, లక్ష్మి ఇద్దరూ కలిసి కల్లు సేవించగా కొద్ది సేపటికి లక్ష్మి నిద్రలోకి జారుకుంది. అదే అదనుగా రాకేష్ ఇంట్లోని వంట గదిలో ఉన్న కత్తితో లక్ష్మి మెడ కోసి హత్య చేశాడు. అనంతరం ఆమె ధరించిన చెవికమ్మల కోసం చెవులను, ముక్కు పుడక కోసం ముక్కును కోసి ఆమెను హతమార్చాడు. అనంతరం శవం గుర్తు పట్టకుండా చేయాలన్న ఉద్దేశంతో ఇంట్లో ఉన్న దుస్తులన్నింటినీ ఆమె మృతదేహంపై వేసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యాడు.

హత్యకు ప్రేరేపించిన పరిస్థితులివే?

నగలను దొంగలించాలన్న ఉద్దేశంతో రాకేష్ హత్యకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. లక్ష్మి చెవులకు ధరించిన బంగారు కమ్మలు, బంగారు ముక్కుపుడకతో పాటు కాళ్లకు ధరించిన వెండి పట్టీలు, చేతికి పెట్టుకున్న వెండి బ్రాస్‌లేట్, చేతి ఉంగరం విలువ దాదాపు రూ.50వేల వరకు ఉంటుందని డీసీపీ వివరించారు. స్నేహితురాలికి మేలుచేసే ఉద్దేశంతో లక్ష్మి చేసిన ప్రయత్నం చివరికి ఆమె ప్రాణాలు తీసిందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన జరిగిన రెండురోజుల్లోనే కేసు మిస్టరీని ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకోవడం పట్ల మేడ్చల్ సీఐ సత్యనారాయణ, డీఐ సుధీర్ కృష్ణను డీసీపీ అభినందించారు.

బురదమయంగా మార్కెట్ యార్డు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, వ్యాపారులు



బురదమయంగా పరిగి మార్కెట్

పరిగి, మే 19 (ఆంధ్రజ్యోతి): పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారింది. చిరుజల్లులు కురిస్తే చాలు ఎక్కడినీరు అక్కడే నిలుస్తోంది. ధాన్యం క్రయ, విక్రయాలు జరిగే ప్రాంతాల్లోనే నీరు నిలుస్తుండడంతో అటు వ్యాపారులు, ఇటు రైతులు నానాఇబ్బందులు పడుతున్నారు. రైతులు తీసుకొచ్చే ధాన్యం బస్తాలు కూడా నిలువచేయని విధంగా ఉందని రైతులు వాపోతున్నారు. నీరునిలిచి దుర్గంధభరితంగా మారి దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. మార్కెటింగ్ అధికారులు, వ్యాపారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించిన మార్కెట్‌యార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

నీరు నిలకుండా చర్యలు తీసుకుంటాం



నీరు నిలుస్తున్న విషయం వాస్తవమే. మార్కెట్ యార్డులో నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. రైతులు, వ్యాపారులు ఇబ్బందులు గురికాకుండా చూస్తాం. త్వరలో అభివృద్ధి పనులు చేపడతాం.

- బి.పరశురాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్, పరిగి



ఘటనా స్థలం వద్ద రోధిస్తున్న మృతుడి భార్య

తాగొద్దని మందలించినందుకు..

- మేడ్చల్‌లో నడి రోడ్డుపై వ్యక్తి దారుణ హత్య

మేడ్చల్ టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలో అందరు చూస్తుండగానే ఓ వ్యక్తిని మరో వ్యక్తి కత్తితో దారుణంగా హతమార్చాడు. తాగిన మత్తులో ఇంట్లో వారితో గొడవ పడినందుకు మందలించాడని నడిరోడ్డుపై కడతేర్చాడు. సోమవారం మేడ్చల్‌లో తీవ్ర కలకలం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని సరస్వతీనగర్‌లో గుజరాత్ రాష్ట్రానికి చెందిన సోలంకి మోతీలాల్(43) వృత్తిరీత్యా భవన నిర్మాణ కార్మికుడు. అదే కాలనీలో ఉంటున్న మేనత్త కొడుకు శంకర్(35) ఆదివారం తప్పతాగి కుటుంబ సభ్యులతో గొడవపడి బయటకు వెళ్లి దగ్గర్లోని రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై పడుకుని తిరిగి రాలేదు. దీంతో శంకర్ కుటుంబసభ్యులు మోతీలాల్‌కు విషయం తెలుపడంతో అతను శంకర్‌ను సముదాయించి ఇంటికి తీసుకొచ్చాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.అనంతరం ఇరువురి కుటుంబ సభ్యులు కల్పించుకుని వారిని సముదాయించారు. సోమవారం ఉదయం 7 గంటలకు మోతీలాల్ ఇంటి పక్కనే ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్తుండగా శంకర్ రాత్రి జరిగిన గొడవను మనసులో పెట్టుకుని మరోసారి మోతీలాల్‌తో గొడవకు దిగాడు. ఈ క్రమంలో శంకర్ తన వద్ద ఉన్న కత్తితో వెనుకనుంచి మోతీలాల్‌ను విచక్షణారహితంగా కడుపులో, ఛాతీలో పొడిచి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కొన ఊపిరితో ఉన్న మోతీలాల్‌ను చికిత్స నిమిత్తం స్థానికులు 108లో ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మోతీలాల్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని మేడ్చల్ సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు.

వైభవంగా పోచమ్మ, మైసమ్మ జాతర



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ ఈటల

మేడ్చల్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపల్ పూడూరు పోచమ్మ, మైసమ్మ ఆలయ జాతర సోమవారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాలను నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బార్వాద్‌లో భూలక్ష్మమ్మ బోనాలు

కోట్‌పల్లి: మండల పరిధిలోని బార్వాద్‌లో భూలక్ష్మమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని భాగంగా నిర్వాహకులు పెరుమాల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పించారు. హోమం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ కార్యకర్తలు

పరిగి,మే 19 (ఆంధ్రజ్యోతి): పీరంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం రైతుబంధు మండల మాజీ కో-ఆర్డినేటర్ కేబీరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. పరిగిలోని తన నివాసంలో 20మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, అందుకే బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వారు తెలిపారు.

చౌదరిగూడ పీహెచ్‌సీకి రూ.2.5కోట్లు మంజూరు

చౌదరిగూడ, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి రూ.2.5కోట్లు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు తెలిపారు. సోమవారం పార్టీ మండల కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. త్వరలోనే పీహెచ్‌సీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌నర్సింహారెడ్డి, నర్సింహులు, బాల్‌రాజ్, యాదగిరిగౌడ్, అజ్జు, రాంచందర్, అఫ్సర్, నాగేందర్, కుమార్, రాము, వెంకటేశ్, భాస్కర్, వేణు, రవికుమార్, వెంకట్రాములు, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

బిడ్డ అడ్డం తిరిగిందని 'గాంధీ'కి రెఫర్

- అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం
- ఘట్‌కేసర్ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం

ఘట్‌కేసర్, మే 19 (ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓమహిళకు అంబులెన్స్ సిబ్బంది పురుడు పోసి ఔరా అనిపించారు. చర్లపల్లిలోని ఇందిరానగర్ కాలనీలో నివాసముండే శివరాత్రి లక్ష్మి నిండు గర్భిణి. సోమవారం లక్ష్మికి పురిటినొప్పులు రావడంతో ప్రసూతికి కుటుంబ సభ్యులు ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ పరీక్షించిన వైద్యులు బిడ్డ అడ్డం తిరిగిందని వెంటనే గాంధీ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. చేసేదిలేక అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే వచ్చిన 108సిబ్బంది లక్ష్మిని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నారపల్లి వద్దకు రాగానే ఆమెకు పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో అప్రమత్తమైన 108సిబ్బంది టెక్నీషియన్ కనకయ్య, పైలెట్ భద్రునాయక్‌లు వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపి ఆమెకు పురుడు పోశారు. ఈకాన్పులో లక్ష్మి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పురుడు పోసిన అనంతరం తల్లీబిడ్డను తిరిగి చికిత్స నిమిత్తం ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో 108 సిబ్బందికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది ఇష్టానూ సారంగా వ్యవహరిస్తూ పలు కేసులను గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేస్తూ కాలం వెళ్ల దీస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రి వైద్యులు చేయలేని పనిని 108 సిబ్బంది చేశారంటే ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి వైద్యుల పనితీరు ఎంటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి వైద్యులతీరుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



108లో జన్మించిన శిశువు



ఘనంగా రుద్రాభిషేకం

కీసర, మే 19(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలోని శ్రీ భవాని శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామికి శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు చేశారు. నిత్యసేవల్లో భాగంగా ఆలయ ఆవరణలో పల్లకీ సేవ నిర్వహించారు.

నైపుణ్యాభివృద్ధిలో విద్యార్థులకు ఉచిత శిక్షణ

వికారాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో, కళాశాలలో చదువుతున్న చదువు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మోమిన్‌పేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషాకిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణీ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో 18 నుండి 25 సంవత్సరాలు వయసు కలిగిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.జూన్ మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా 239 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తి చేసిన, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులతో పాటు చదువు మధ్యలో మానేసిన వారూ ఈ శిక్షణకు అర్హులన్నారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు మోమిన్‌పేట గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ నెల 22వరకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శంకర్‌పల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో అక్బర్ అన్నారు. మోకిలతండా పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల్లో పఠనాశక్తి, చిత్రలేఖనం, యోగ-ధ్యానం, డ్రాయింగ్, పెయింటింగ్, చేతిరాత అంశాల్లో నైపుణ్యం పెంపొందిస్తామని తెలిపారు. చేతిరాత నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆశీర్వాదం, రాములు ఉన్నారు.

ఐటీఐ కళాశాల అభివృద్ధికి కృషి

ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



కండ్లపల్లిలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్/పూడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): యూనియన్ స్కిల్ డెవలప్‌మెంట్ మినిస్టర్ జయంత్ చౌదరి ఆదేశాల మేరకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడే కొండ విశ్వేశ్వర్ రెడ్డి సోమవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఐటీఐ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. .కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డా.కొప్పుల రాజశేఖర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ నరోత్తం రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, బీజేవైఎం ఆఫీస్ సెక్రటరీ వెంకట్, నాయకులు గదిగే శివరాజు, సుధాకర్ ఆచారి, రాఘవేందర్, శ్రీనివాస్, విజయ్, వినయ్ పాల్గొన్నారు. అలాగే పూడూరు మండలం కండ్లపల్లి గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మించిన రోడ్డును ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లేష్ పటేల్, పూడూరు మండల అధ్యక్షుడు తుంపల్లి రాఘవేందర్, జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటన్న, అనిల్, శ్రీశైలం, కృష్ణాచారి, మండల ఉపాధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

మేడ్చల్ ప్రతినిధి, మే 19(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు 24వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. ఐదు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందని, జిల్లాలో రెండు సెంటర్లలో జిల్లా స్థాయి శిక్షణ, 15 సెంటర్లలో మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనికోసం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశామని, రోజుకో సబ్జెక్ట్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. డిజిటల్ ఎడ్యుకేషన్, లైఫ్ స్కిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, కంటెంట్ ఎన్రిచ్మెంట్, లెర్నింగ్ అవుట్ కమ్స్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. సాంకేతిక రంగంలో మార్పులకనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో నిర్వహించనున్నారు. ఇందులో గెజిటెడ్ హెడ్ మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్, స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీఈటీలకు శిక్షణ ఇస్తారు. అలాగే జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో ఎస్ఏ తెలుగు, ఎస్ఏ హిందీ, ఎస్ఏ లాంగ్వేజ్ పండితులకు శిక్షణ ఇస్తారు. జిల్లాలోని 15 మండలాల్లో కూడా శిక్షణ తరగతులు జరుగుతాయి. వీటిలో ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్లు, ఎస్‌జీటీలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రైమరీ టీచర్స్ వారివారి మండలాల్లో నిర్వహించే శిక్షణ కేంద్రాల్లో పాల్గొంటారు. ప్రతి సెంటర్‌కు ఒక కోర్సు డైరెక్టర్ ఉంటారు. ఐదురోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులకు ఉపాధ్యాయులందరు హాజరుకావాలని డీఈవో విజయకుమారి కోరారు.

ఎస్ఐపై రాచకొండ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు

యాచారం, మే 19(ఆంధ్రజ్యోతి): తనకు జరిగిన అన్యాయంపై యాచారం ఎస్సైకి ఫిర్యాదు చేస్తే తనపై తప్పుడు కేసు నమోదుచేయడంతో పాటు తన ఫిర్యాదుపై తేదీని తారుమారు చేశారని న్యాయవాది పగడాల శ్రీశైలం సోమవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. కేసు వాపస్ తీసుకోకుంటే ఇబ్బందుల పాలవుతావని తనను బెదిరించాడని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నా ఫిర్యాదుపై సమాచారం అడిగితే ఎస్సై మధు సమాధానం చెప్పకపోగా తనపై తప్పుడు కేసు బనాయించారని తెలిపారు. ఎస్సైపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్టు చెప్పారు. ఈ విషయమై ఎస్సై మధు స్పందిస్తూ.. 13, 14 తేదీల్లో తాను సెలవులో ఉన్నట్లు తెలిపారు. శ్రీశైలం ఫిర్యాదుపై ఆన్‌లైన్‌లో ఉన్న తేదీనే నమోదు చేశామన్నారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి స్పందిస్తూ దీనిపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూర్, మే 19(ఆంధ్రజ్యోతి): కొత్తూర్, బైపాస్ రోడ్డులో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ రవీందర్ సోమవారం పేర్కొన్నారు. తిమ్మాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూర్, పెంజర్ల పీడర్ల మరమ్మతుల్లో భాగంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

రహదారిపై పార్కింగ్‌తో ఇబ్బందులు

నిత్యం ట్రాఫిక్ జామ్‌లు | హోటళ్లు, దుకాణదారులు, కాంప్లెక్స్ యజమానుల నిర్లక్ష్యం | పట్టించుకోని అధికారులు



హిమాయత్‌నగర్ చౌరస్తాలో దాబాలు, హోటళ్ల వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

మొయినాబాద్ రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): కొందరు తమ వాహనాలను ప్రధాన రహదారులపై నిలుపుతుండడంతో మండలంలోని అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, మొయినాబాద్‌లో నిత్యం ట్రాఫిక్ జామ్మెంతోంది. దాబాలు, దుకాణాలు, బ్యాంకులు, హోటళ్ల వద్ద పార్కింగ్ ఏర్పాటు లేక ఈ సమస్య తలెత్తుతోంది. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఉడిపి హోటల్, సర్వోత్తం అజీజ్ హోటల్, కెనరా బ్యాంకులోకి వచ్చే వారు తమ కార్లు, బైక్‌లను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ప్రజలకు ఇంత ఇబ్బందులు కలుగుతున్నా హోటళ్ళ, దాబాల నిర్వాహకులు గానీ, కమర్షియల్ కాంప్లెక్స్‌ల యజమానులు గానీ పార్కింగ్ ఏర్పాట్లు చేయడం లేదు. అజీజ్‌నగర్ చౌరస్తా వద్ద గ్రామంలోకి వెళ్లే వాహనదారులు యాతన పడుతున్నారు. అలాగే సమీపంలో చిన్నపాటి యూటర్న్ వల్ల సైతం ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మొయినాబాద్ వాహనాలను రోడ్డు పైనే నిలిపి షాపుల్లోకి వెళ్తున్నారు. దుకాణ యజమానులు పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. అజీజ్‌నగర్ చౌరస్తా నుంచి మొయినాబాద్ వరకు అనేక హోటళ్ల, దుకాణాలున్నాయి.వాటి ఎదుట పార్కింగ్‌లతో నిత్యం రోడ్డుపై వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు, దుకాణాల నిర్వాహకులు ట్రాఫిక్ జాం సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


అజీజ్‌నగర్ చౌరస్తా వద్ద స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలి



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటోంది. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి. చౌరస్తాలోని దుకాణాలకు పార్కింగ్ లేదు. రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. కొందరు రోడ్డు ఆక్రమించి షెటర్లను అద్దెకిస్తున్నారు. అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నందుగౌడ్, హిమాయత్‌నగర్

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం


క్రాష్ బారియర్‌ను ఢీకొన్న కారు

ఆదిభట్ల, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. ఓఆర్ఆర్‌పై కారు క్రాష్ బారియర్‌ను ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదిభట్ల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బెంగాల్ రాష్ట్రానికి చెందిన కితాబ్ అలీ(35) కుటుంబంతో నాగారంలో ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నాడు. సోమవారం ఘట్‌కేసర్ నుంచి తుక్కుగూడ వచ్చాడు. తిరిగి కారులో ఓఆర్ఆర్ మీదుగా ఇంటికి బయల్దేరాడు. వేగంగా వెళ్తున్న కారు ఎగ్జిట్ 12సమీపంలోని క్రాష్ బారియర్‌ను ఢీకొంది. దీంతో వాహనం నడుపుతున్న కితాబ్ అలీ మృతిచెందాడు. ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సై బాల్‌రాజు చేరుకొని పరిశీలించి కారులోంచి మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టంకు తరలించారు. కితాబ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వలస కార్మికుడు..

నందిగామ: మండలం పరిధి చాకలిగుట్టతండా సమీపంలో జహంగీర్ పీర్ దర్గా రోడ్డుపై ద్విచక్రవాహనం ఢీకొట్టిన ప్రమాదంలో వలస కార్మికుడు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బాసన్‌సింగ్(25) తాటిగడ్డతండాలో ఉంటూ స్థానిక పరిశ్రమల్లో పనిచేస్తుండేవాడు. బాసన్‌సింగ్ ఆదివారం రాత్రి కిరాణం సామాను తీసుకొని తండా శివారులో జేపీ దర్గా రోడ్డు దాటుతుండగా రంగాపూర్‌వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారుడు అతడిని ఢీకొట్టాడు. దీంతో బాసన్‌సింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అతడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బాసన్‌సింగ్ తండ్రి ఇన్నర్ డియోసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. ద్విచక్ర వాహనదారుడి అజాగ్రత్త, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు నిర్ధారించారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల మరమ్మతులకు రూ.7కోట్లు మంజూరు


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్, మే 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలివేసిన డబుల్ బెడ్ రూం ఇండ్ల మరమ్మత్తులకు ప్రభుత్వం రూ.7కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. తమ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ, అలాగే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తోందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఇది డబుల్ ధమాకా అని అభివర్ణించారు. సోమవారం షాద్‌నగర్‌లోని వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకు స్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గూడు కోసం పేదలు గోస పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 16నెలల్లోనే సొంత ఇండ్లు మంజూరు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల మరమ్మతులు చేయించి అర్హులకు కేటాయిస్తామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

కేశంపేట: వేముల్‌నర్వలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేకాధికారి భూమిపూజ చేశారు. గ్రామంలో మొదటి విడతలో 42మందికి ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. కొన్ని ఇండ్లకు ముగ్గుపోశామన్నారు. 400చదరపు ఫీట్లకు తగ్గకుండా, 600 ఎస్ఎఫ్‌టీకి పెరగకుండా నిర్మాణాలు చేపట్టాలన్నారు. బేస్మెంట్ పూర్తికాగానే లక్ష లబ్ధిదారులు అకౌంట్‌లో పడుతాయని, ఇలా విడతల వారీగా స్లాబ్ అయ్యే వరకు రూ.5లక్షలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శివమ్మ, గోపాల్, నర్సింలు, మల్లేష్, ఆనందొరెడ్డి, మనోహర్‌గౌడ్, రాఘవేందర్, ఆంజనేయులు, శ్రీను, ప్రభాకర్ పాల్గొన్నారు.

పైలెట్ గ్రామంలో 20ఇళ్లకు రూ.లక్ష జమ

కేశంపేట మండలంలో పైలెట్ గ్రామం పోమాల్‌పల్లిలో మొదటి విడతగా 20ఇళ్లకు రూ.లక్ష చొప్పున జమయ్యాయి. గ్రామంలో 22ఇళ్ల నిర్మాణానికి అనుమతులు రాగా వాటిలో 20ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. నిర్మాణ పనులు పరిశీలనకు వచ్చిన అధికారులు నిర్ణీత విస్తీర్ణం కంటే ఎక్కువ జాగలో ఇళ్లు నిర్మించారని, వాటికి బిల్లులు రావు అని చెప్పడంతో ఖంగుతిన్నారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్ ఈ సమస్యను ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే వారి సమస్యను పరిష్కరించారు. నిబంధనల మేరకు మార్పులు చేయించారు. బేస్మెంట్ లెవల్ పూర్తయిన వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. దీంతో అందరి ఖాతాల్లో లక్ష చొప్పున జమయ్యాయి.

పేదల సొంతింటి కల నెరవేరుతోంది

కందుకూరు: కాంగ్రెస్ పాలనలో పేదోడి సొంతింటి కల నెరవేరుతోందని, సీఎం రేవంతర్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. మండలంలోని బాచుపల్లిలో మొదటి దశలో మంజూరైన ఇండ్ల అబ్ధిదారులతో ఏర్పాటు చచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో నిరుపేదలకు ఇళ్లు కట్టించడంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కె.లక్ష్మారెడ్డి చొరవతో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. బాచుపల్లిలో 13 మందికి డబ్బులు జమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కృష్ణ, విజయ్, యుగేందర్‌రెడ్డి, వెంకటేష్, నవీన్‌గౌడ్, కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.


కేశంపేట: ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రత్యేకాధికారి చంద్రశేఖర్


కందుకూరు: బాచుపల్లిలో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన పాండురంగారెడ్డి

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి


మడికట్టులో శివాజీ విగ్రహం వద్ద నాయకులు

చేవెళ్ల, మే 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని సిద్ధార్థ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ జయదేవ్ అన్నారు. తంగడపల్లి పంచాయతీ అనుబంధ గ్రామం మడికట్టులో శివాజీ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు శివాజీ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారు ఆదిరెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, బీజేపీ పట్టణ, గ్రామీణ అధ్యక్షులు అనంత్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో పురందాస్

చేవెళ్ల, మే 19(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేస్తామని, ప్రైమరీ స్కూళ్ల టీచర్లకు ఐదు రోజుల వృత్యంతర శిక్షణ నిర్వహిస్తున్నామని ఎంఈవో పురందాస్ అన్నారు. సోమవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ... ఎఫ్ఎల్ఎన్, ఏ1 గురించి శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. శిక్షణ తరగతులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతాయన్నారు. తెలుగు,ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు, సీఆర్‌పీలు కృష్ణ, శంకర్, నర్సింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి పుస్తె, మట్టెల అందజేత


పుస్తె, మట్టెలు అందజేస్తున్న కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్

కేశంపేట, మే 19(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డ పెళ్లికి పుస్తె, మట్టెలు ఇచ్చి ఉదారాతను చాటుకున్నారు బీఆర్ఎస్ నాయకుడు కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్. కొండారెడ్డిపల్లికి చెందిన వడ్ల లలిత-ఆచారిల మనుమరాలు అనూష వివాహం సోమవారం నిర్వహించారు. ఈ పెళ్లికి ప్రేమ్‌కుమార్ గౌడ్ పుస్తె, మట్టెలు అందించారు. అనూష చిన్ననాడే తండ్రిని కోల్పోవడంతో తాత, నాన్నమ్మల వద్ద పెరిగింది. ఆమె పెళ్లికి గ్రామస్తులు సైతం తోడ్పాటునందించారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ రవీందర్ గౌడ్, భారతమ్మ, ఉదయ్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీశైలం, రాఘు పాల్గొన్నారు.

'మృతి చెందిన గేదెలకు పరిహారం ఇవ్వాలి'

కందుకూరు, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచులూరు గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు మృతిచెందిన గేదెల రైతుకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్, సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం గేదెల కళేబరాలను వారు పరిశీలించి రైతు కళమ్మను పరామర్శించారు. మూడు గేదెలకు రూ.3లక్షల పరిహారాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

వైద్య చికిత్సల కోసం స్నేహితుల సాయం



ఆమనగల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్‌కొండ పరిధి దయ్యాలబోడు తండాకు చెందిన వినోద్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అతడి మిత్రులు తలాకొంత పోగుచేసి రూ.16వేలను వినోద్ కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో రాజు, రాజేశ్, శ్రీను, నవీన్, ప్రవీణ్, రవీ, శ్రీనివాస్, పూల్‌సింగ్, జైలాల్, శ్రీను, విజయ్,సాయికుమార్, రమేశ్, వినోద్, స్వరుణ్, సుమన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ


కిట్ అందజేస్తున్న స్థానిక నాయకులు

తలకొండపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): వెంకట్రావుపేట్‌లో సోమవారం గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశ్ మహిళలకు కిట్లను పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు, నాయకులు గర్భిణులకు వాటిని పంపిణీ చేశారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హైమవతిరమేశ్, అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు, లింగం, పాండురంగయ్య, శ్రీను, రాములు, పుల్లయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే బడుగులకు లబ్ధి


హైతాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న చంద్రశేఖర్

షాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలోనే బడుగు, బలహీన వర్గాలకు లబ్ధి చేకూరుతుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం హైతాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. గత పాలకులు గొప్పలు చెప్పి ఏమీ మిగిల్చకుండా పేదలకు అన్యాయం చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల కట్టిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఖాజామియా, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, అండాలు, కొమురమ్మ, నాయకులు శ్రీరాములు,బుర్హాన్, కృష్ణ, సత్తయ్య, నర్సింహ, శ్రీనివాస్, కృష్ణ, రవి, ప్రవీణ్, రాముగౌడ్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాల అందజేత


ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న యాదయ్య

మహేశ్వరం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అర్హులందరికీ వర్తింపజేస్తామని, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను నమ్మొద్దని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సీహెచ్.యాదయ్య అన్నారు. అమీర్‌పేటలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన వారికి ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, రైతు రుణమాఫీ వంటి పథకాలు అబద్ధమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, కమిటీ సభ్యులు యాదయ్య, రఘుపతి, రమేష్‌గౌడ్, చంద్రమోహన్, భాస్కర్, రాజేందర్, బాల్‌రాజ్, షఫీ, మల్లేష్, రాజు, శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

మంచాల, మే 19(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో ట్రైన్డ్ టీచర్లు నాణ్యమైన విద్య బోధిస్తారని హెచ్ఎం గిరిధర్ అన్నారు. విద్యార్థులు, విద్యా కమిటీ సభ్యులతో కలిసి సోమవారం ఆరుట్లలో ఇంటింటికి తిరిగి చిన్నారులను పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం.మహేశ్, ఎస్ఎంసీ సభ్యులు కంబాలపల్లి భాస్కర్, చిందం శ్రీశైలం, నూకం మల్లేశ్, నూకం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆరుట్లలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు, భాస్కర్

ధాన్యానికి మద్దతు ధర పొందాలి


మార్కెట్ యార్డులో రైతుతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

షాద్‌నగర్ అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ కోరారు. షాద్‌నగర్ మార్కెట్ యార్డులో సోమవారం బాబర్‌ఖాన్, మార్కెట్ కమిటీ మెంబర్లు కరుణాకర్, మల్లేష్, భరత్ లహోటి, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్ పర్యటించారు. రైతులను, కమీషన్ ఏజెంట్లను, ఖరీదుదారులను కలిసి మాట్లాడారు. మార్కెట్ యార్డుకు వచ్చి ధాన్యాన్ని తెచ్చి తక్కువ ధరలకు విక్రయిస్తూ నష్టపోవద్దని రైతులను కోరారు. సన్న రకం ధాన్యాన్ని 2,320 రూపాయలకు కొనుగోలు చేసి రూ.500 బోనస్ ఇస్తున్నట్టు చెప్పారు. దొడ్డు రకం ధాన్యాన్ని 2,300 కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. వడ్లలో 17 శాతం కంటే తక్కువ ఉండేలా ఆరబెట్టి, తుర్పారబట్టి తేవాలని కోరారు. మార్కెట్‌లోని కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ శాఖ సిబ్బంది సమన్వయంతో నిత్యం ధాన్యం కొనుగోళ్ల టెండర్లు వేయాలని సూచించారు. టెండర్లలో ఇతర ప్రాంతాల వ్యాపారులు సైతం వచ్చి పాల్గొనేలా చూస్తే రైతులకు లాభం జరుగుతుందని తెలిపారు. రైతులకు మద్దతు ధరను కల్పిస్తేనే వ్యాపారులు, వ్యవసాయ మార్కెట్‌శాఖ సిబ్బంది, ఇతర వ్యాపార రంగ సంస్థలు బాగుంటాయన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. రైతులకు నష్టం కల్గించే ఏ చర్యనూ తాము సహించం అని బాబర్‌ఖాన్ హెచ్చరించారు.

మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


మైసమ్మ కుటుంబీకులను పరామర్శిస్తున్న జైపాల్‌యాదవ్, తదితరులు

ఆమనగల్లు, మే19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఉండే వస్పుల మైసమ్మ ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ సోమవారం మృతురాలి కుటుంబ సభ్యులు, ఆమె కుమారుడు వస్పుల సాయిలును ఆయన పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యనాయక్, ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లాలయ్యగౌడ్, ఖలీల్, సైదులుగౌడ్, భాస్కర్, జంగయ్య, తదితరులు ఉన్నారు.

మట్టి పరీక్షలు ఉట్టి మాటే..!

(ఐదో పేజీ తరువాయి)

పత్తి, మొక్కజొన్న, కంది, వరి, పెసర, జొన్న, కూరగాయలను సాగుచేస్తారు. యేటా పంటమార్పిడి చేయడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి భూసార పరీక్షలు చేయించడం లేదు. ఏ నేలలో ఏ పంట వేయాలో చెప్పడం లేదు.

మట్టి సేకరణ ఇలా..

ఎంచుకున్న ఎకరం పొలంలో ఒక మూల నుంచి మూడు అడుగుల దూరాన్ని వదలిపెట్టి 'వి' ఆకారంలో ఆరు అంగుళాల గుంత తీసి అడుగు నుంచి మూలల వైపు మట్టిని సేకరించాలి. ఇదే విధానంలో 6నుంచి 8చోట్ల జిగ్‌జాగ్‌గా 6 నుంచి 7కిలోల మట్టి సేకరించాలి. ఆ మట్టిని నీడలో కాగితం సంచిలో గానీ, ఒక వస్త్రంలో పోసి చూర్ణంగా చేయాలి. పాలిథీన్ కవర్లో మట్టిని భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి. మట్టి పరీక్షల అనంతరం సేంద్రియ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్, సల్ఫర్, కాల్షియం పోషకాలు భూమిలో ఎంత మోతాదులో ఉన్నాయో తెలుస్తుంది.

నమోదు ఇలా...

మట్టి నమూనాలను ఇబ్రహీంపట్నంలోని భూసార పరీక్ష కేంద్రం లేదా నగరంలోని రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో గల భూసార పరీక్ష కేంద్రానికి పంపించాలి. అక్కడ పరీక్షల ఫలితాల ఆధారంగా పంటసాగు చేసుకోవాలి. మట్టి నమూనాలపై రైతు పేరు, తండ్రి పేరు, భూమి సర్వే నంబర్, పొలం వివరాలు, సాగు చేసిన పంట రకం, దానికి వాడిన ఎరువుల వివరాలు, పురుగు మందుల వివరాలు, మున్ముందు సాగు చేసే పంట వివరాలు, మొబైల్ నంబర్‌ను వ్యవసాయాధికారికి ఇవ్వాలి. ఇందుకు ఎలాంటి రుసుం ఇవ్వాల్సిన అవసరం లేదు.

అనేక ప్రయోజనాలు

రెండేళ్లకోసారి భూసార పరీక్షలు నిర్వహించాలి. అలా చేయడం ద్వారా నేలలో పోషకాలు ఏ మేర ఉన్నాయో తెలుస్తుంది. అధికారుల సూచనల మేరకు ఎరువులు, మందులు ఏ మోతాదులో వేయాలో తెలుస్తుంది. పంటకు సమగ్ర పోషకాలందేలా సూచిస్తారు.

స్థానికంగా భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి



చేవెళ్ల డివిజన్ పరిధిలో రైతులకు అందుబాటులో ఉండేలా భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసేందుకు వ్యవసాయ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. గతంలో ఏఈవోలు వచ్చి మట్టి నమూనాలు తీసుకెళ్లి రైతులకు ఫలితాలు చెప్పేవారు. ప్రస్తుతం అలాంటివి ఎక్కడ కనిపించడం లేదు.

- సీహెచ్.శ్రీనివాస్, రైతు, చేవెళ్ల

రారండోయ్ సర్కారు బడికి..!

(ఐదో పేజీ తరువాయి)

గుర్తించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించాలి. 8 నుంచి 10వ తేదీ వరకు ఉపాధ్యాయులు పనిచేస్తున్న పాఠశాల పరిధిలో కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి డ్రాపౌట్ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి. ప్రత్యేక అవసరాల పిల్లలు ఉంటే వారిని అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి. 11న అప్పటి వరకు నిర్వహించిన బడిబాటపై సమీక్షించుకోవాలి. 12న ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించి అదే రోజు విద్యార్థులకు పుస్తకాలు, నోటుబుక్స్ యూనిఫామ్స్ అందిం చాలి. 13న జిల్లాలో సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభను నిర్వహించాలి. 16న ఎఫ్ఎల్ఎన్, లిప్ దినోత్సవం నిర్వహించాలి. 17న విలీన విద్య, బాలికా దినోత్సవాన్ని చేపట్టాలి. 18న తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన కల్పించి, మొక్కల పెంపకం, ప్రాధాన్యాన్ని వివరించాలి. 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించాలి.

బడిబాటను విజయవంతం చేద్దాం



కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అందరి సమన్వయంతో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలి. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పోటీ తట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంపొందించడమే లక్ష్యంగా జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. కార్యక్రమానికి ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలి.

- డీఈవో, సుశీందర్‌రావు